# చిహ్నంలో మార్పులు చేస్తే న్యాయ పోరాటమే

- సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు కుట్ర
- రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయతోరణం, చార్మినార్ తొలగిస్తే ఊరుకోం..
- కాకతీయులు అణగారిన వర్గాలకు చెందిన బీసీలు
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కరీమాబాద్, మే 29 : కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర చిహ్నం నుంచి తొలగిస్తామని, ఇవి రెండు రాచరిక వ్యవస్థ చిహ్నాలని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి అనడం దేనికి సంకేతమని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. రాష్ట్ర చిహ్నంలో చేస్తున్న మార్పులను నిరసిస్తూ బుధవారం ఖిలావరంగల్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కాకతీయులు యావత్ దక్షిణ భారతదేశాన్ని పరిపాలించారని, కాకతీయులు రాచరిక వ్యవస్థ నుంచి వచ్చిన వారు కాదని, పేదల కోసం పని చేసిన వారని పేర్కొన్నారు. వారు రామప్ప, పాకాల లక్నవరం, ఘన్‌పూర్, సింగసముద్రం, నల్లగొండలో పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్‌తో పాటు వేలాది చెరువులు, కుంటలు నిర్మించడం వల్లే ఈ రోజు తెలంగాణ రైతాంగం బతికి బట్ట కడుతున్నదన్నారు. తెలంగాణ వచ్చాక పదేళ్లలో ఉద్యమనేత కేసీఆర్ చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ ద్వారా అభివృద్ధి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర చిహ్నంతో పాటు రాష్ట్ర గీతంలో మార్పులు చేయాలని చూస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఆంధ్రోళ్లు తెలంగాణ వ్యవసాయం, యాస, భాషను తుడిచి వేయాలని అనుకున్నారని, చిహ్నం మార్పులపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్పందించాలన్నారు. తెలంగాణ వ్యతిరేక శక్తులు రేవంత్‌రెడ్డి వెనక ఉన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమైక్యవాది కాబట్టే తెలంగాణ చరిత్రను కనుమరుగు చేయాలని చూస్తున్నారని, ఆయన ఎన్నడూ జై తెలంగాణ అనలేదని, ఉద్యమంలో తుపాకులు పట్టుకుని తిరిగిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అని విమర్శించారు. ఏకపక్షంగా చిహ్నంలోని కాకతీయ తోరణం, చార్మినార్ మారుస్తామని నిర్ణయం తీసుకోవడం, ఇందుకోసం ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ, కమిటీలు, సబ్ కమిటీలు వేయలేదన్నారు. రేవంత్ పాలన అస్తవ్యస్తంగా ఉందని, రాష్ట్ర చిహ్నం మార్పు ఇందుకు నిదర్శనమన్నారు. రేవంత్, చంద్రబాబు గురుశిష్యులని, తెలంగాణ చరిత్ర, ఉద్యమం గురించి మాట్లాడే హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు. తప్పుడు హామీలతో కేవలం 1.8 శాతం ఓట్ల తేడాతో గెలిచారన్నారు. 800 ఏండ్లు పాలించిన కాకతీయ రాజులు బడుగు బలహీనవర్గాలకు చెందిన వారన్నారు. 44 వేలకు పైగా చెరువులను తవ్వించి రాజ్య వైభవం ప్రతిబింబించేలా తోరణం తీర్చిదిద్దారన్నారు. 400 ఏండ్ల క్రితం ప్లేగు వ్యాధితో వేలాది మంది చనిపోతే వైద్యం-సంక్షేమానికి గుర్తుగా చార్మినార్ నిర్మించారన్నారు. రాజరికానికి గుర్తులైతే జాతీయ జెండాలో ఉన్న అశోకచక్రం, 4 సింహాల గుర్తులు సైతం తీసివేస్తారా అని ప్రశ్నించారు. చరిత్రను మార్చే కుట్ర చేయొద్దన్నారు. చట్టప్రకారం రాష్ట్ర చిహ్నం మార్చాలని రేవంత్ కేంద్ర ప్రభుత్వాన్ని కలిస్తే తాము న్యాయ పోరాటం చేస్తామని, హైకోర్టుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మర్రి యాదవరెడ్డి, హరిరమాదేవి, కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ పాల్గొన్నారు.



ఖిలా వరంగల్ కళాతోరణం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణాన్ని తొలగించి ఓరుగల్లు కీర్తిని తగ్గించాలని చూస్తే ఊరుకునేది లేదని అన్ని వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 'కేసీఆర్ ఆనవాళ్లు' ఉండకూడదనే అక్కసో.. లేక చారిత్రక ప్రాధాన్యతపై అవగాహన లేకనో రేవంత్ సర్కారు అనుసరిస్తున్న అనాలోచిత వైఖరిపై ప్రజలు, సాహితీవేత్తలు, చరిత్రకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి సంస్కృతి, వారసత్వ సంపద గుర్తింపును మంటగలిపేలా వ్యవహరిస్తున్నదని మండిపడుతున్నారు. ప్రజలు మెచ్చిన కాకతీయుల పాలనకు తెలంగాణలో మొదటి నుంచీ ప్రత్యేక గుర్తింపు ఉన్నదని.. ఇప్పుడు తోరణాన్ని తొలగించి కొత్తగా రాజముద్రను మార్చాల్సిన అవసరమేమున్నదని ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఈ ప్రాంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నోరుమెదపకపోవడంపై భగ్గుమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన విరమించుకోకుంటే వారసత్వ సంపద పరిరక్షణ కోసం ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- వరంగల్, మే 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# కీర్తి తగ్గిస్తే రణమే

## భగ్గుమంటున్న ఓరుగల్లు జనం

### రేవంత్ సర్కారు నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత

- రాజముద్ర జోలికొస్తే సహించేది లేదని స్పష్టం
- మార్చాల్సిన అవసరమేముందన్న సాహితీవేత్తలు, చరిత్రకారులు
- అధికార పార్టీ ఎమ్మెల్యేల మౌనంపై ఆగ్రహం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం చిహ్నాన్ని తొలగించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై ఓరుగల్లు ప్రజలు మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలును నెరవేర్చకుండా తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపద గుర్తింపును మంటగలిపే పనులు ఎందుకని చరిత్రకారులు, సాహితీవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంశాలను పట్టించుకోకుండా పదేండ్లుగా ఉన్న రాజముద్రకు కొత్తగా ఇప్పుడు మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా ఆలోచన విరమించుకోకుంటే ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేస్తున్నారు. తెలంగాణలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఉన్న ప్రాధాన్యతను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలపై ఆ పార్టీకి చెందిన ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 10 స్థానాల్లో గెలిచింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే సైతం అధికార పార్టీలో చేరారు. కాకతీయ కళాతోరణంపై కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నిర్ణయాలపై అధికార పార్టీకి చెందిన 11మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరూ స్పందించడం లేదని వరంగల్ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఉన్న గుర్తింపును చెరిపివేసే చర్యలను ఎంత మాత్రం సహించబోమని హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప సాంస్కృతిక గుర్తింపుగా ఉన్న కాకతీయుల కీర్తి తోరణం తొలగించే ఆలోచన విరమించుకునేలా కార్యాచరణ ఉంటుందని చరిత్రకారులు, కవులు, రచయితలు చెబుతున్నారు.

### చిహ్నాన్ని మార్చడం ఎందుకు?



ములుగు, మే 29(నమస్తే తెలంగాణ) : తెలంగాణ కీర్తి ప్రపంచానికి తెలిసేలా కేసీఆర్ రాష్ట్ర రాజముద్రలో కాకతీయుల తోరణం పొందుపర్చితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని తొలగిస్తే ఏం వస్తుంది? కాకతీయులు, కుతుబ్‌షాహీల పరిపాలనను గుర్తుచేసేలా కాకతీయ తోరణం, చార్మినార్ చిహ్నాన్ని రూపొందించారు. ఇప్పుడు ఇందులో నుంచి కాకతీయ తోరణాన్ని తొలగించి దాని స్థానంలో ఏం పెడతారు? మన రాష్ట్ర ఎంబ్లమ్‌ను చూడగానే ఇది తెలంగాణ అని తెలిసేలా ఉంది. వందేళ్ల తర్వాత తెలంగాణ అధికారిక చిహ్నాన్ని ఎవరు చేశారంటే కేసీఆర్ చేసిండు అనే పేరు వస్తుందనే అక్కసుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకున్నట్లు అనిపిస్తున్నది. ఎంతో శ్రమించి, మేధావుల అభిప్రాయాలు తీసుకొని ఆలోచించి రూపొందించిన చిహ్నంలో మార్పులు చేయడం సరికాదు.

– పింగిలి నాగరాజు, సామాజికవేత్త, ములుగు జిల్లా

### కాంగ్రెస్ నాయకులకు చరిత్ర తెలియదు



భూపాలపల్లి రూరల్, మే 29 : కాంగ్రెస్ నాయకులకు కాకతీయుల చరిత్ర తెలియదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కళాతోరణాన్ని తొలగించడం మంచి పద్ధతి కాదు. ప్రజలు మెచ్చేలా పాలించిన కాకతీయులకు ఒక ప్రత్యేకత ఉంది. చరిత్ర తెలిసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దానిని రాజముద్రలో చేర్చితే చరిత్ర తెలియని కాంగ్రెస్ దానిని తొలగించింది. కాకతీయుల కాలంలో కట్టిన రామప్ప యునెస్కో గుర్తింపు పొందింది. వారు కట్టించిన చెరువులు, ఆలయాలు మన కళ్లముందు కదలాడుతున్నాయి. కాకతీయులు నేటి పాలకులకు మార్గదర్శకులు. ఓరుగల్లు చారిత్రక ప్రాధాన్యతను తగ్గిస్తే ఉమ్మడి వరంగల్ ప్రజల నుంచి వ్యతిరేకత మొదలవుతుంది.

– టీ. నరేశ్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్, భూపాలపల్లి

### తోరణాలు సాంస్కృతిక సంపద



హనుమకొండ చౌరస్తా, మే 29: కాకతీయ కళాతోరణం కళ్యాణిచాళుక్యుల నుంచి సంక్రమించింది. దాని తర్వాత ఈ ప్రాంతాన్ని పరిపాలించిన కాకతీయులు ఇంకా సుందరంగా తీర్చిదిద్ది గణపతిదేవుని కాలంలో (1199-1260) రాజధాన్ని ఖిలా వరంగల్‌కు మార్చి కళాతోరణాల్ని తీర్చిద్దారు. ఇప్పటివరకు తెలంగాణలోని ప్రజలందరూ కాకతీయుల తోరణాలను తమ సాంస్కృతిక సంపదగా భావిస్తున్నారు. మొఘల్‌రాజులు కట్టించిన ఎర్రకోటపై కూడా జాతీయ జెండా ఎగురవేయవచ్చా? కాంగ్రెస్ ప్రధానమంత్రులు కూడా ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేస్తున్నారు.

– తక్కళ్లపల్లి దయాకర్‌రావు, కేయూ రిటైర్డ్ హిస్టరీ ప్రొఫెసర్

### చిహ్నం తొలగింపు సరైంది కాదు



జనగామ చౌరస్తా, మే 29 : కాకతీయ కళాతోరణం, చార్మినార్ వంటి రాచరిక చిహ్నాలకు తావులేదని రాష్ట్ర ప్రభుత్వం అనడం సరైంది కాదు. అది అసలు కారణమే కాదు. ప్రజల సమ్మతి పొందిన ఏ రాజవంశాన్ని అయినా మనం చిహ్నంగా తీసుకోవచ్చు. గత తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరించిన చిహ్నం పట్ల ప్రజల నుంచి ఎలాంటి భిన్నాభిప్రాయాలు రాలేదు. అందరూ సుముఖంగా ఉన్నారు. సంతృప్తి చెందారు. రాష్ట్ర ప్రభుత్వం మార్పుతో చిహ్నాల మార్పు అనేది కొత్తగా తెరమీదకి వచ్చింది. ప్రజా ఉద్యమాలను ప్రతిబింబించే విధంగా కొత్త చిహ్నంలో మార్పు తీసుకొస్తామని ఈ ప్రభుత్వం చెబుతున్నది. కొత్త చిహ్నం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటే మాత్రం కచ్చితంగా వ్యతిరేకించాల్సిందే.

– రెడ్డి రత్నాకర్‌రెడ్డి, చరిత్ర పరిశోధకుడు, జనగామ

# మేడారంలో పూజారుల నిరసన

## సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

తాడ్వాయి, మే29 : మేడారం సమ్మక్క-సారలమ్మకు కేటాయించిన స్థలాన్ని భద్రకాళి దేవస్థాన పూజారులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం గద్దెల ప్రధాన గేట్‌కు తాళాలు వేసి పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దేవస్థానానికి వరంగల్ పట్టణంలో వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించగా, ఆ స్థలంలో ఇటీవల భద్రకాళి, మెట్టుగుట్ట దేవస్థానం సంయుక్త నిధులతో సెంట్రల్ జైల్ ఎదురుగా ధార్మిక భవనాన్ని నిర్మించారన్నారు. అప్పటి నుంచి పలు దేవస్థాన కార్యాలయాలు అందులోనే కొనసాగుతుండగా గత కొద్ది రోజుల నుంచి భద్రకాళి దేవస్థాన అయ్యగార్లు భవనాన్ని ఖాళీ చేయాలని, వేద పాఠశాల నిర్వహిస్తామని చెప్తూ మంత్రులు, ఎమ్మెల్యేలతో దేవాదాయశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. తమ దేవస్థానానికి చెందిన భవనంపై వారి పెత్తనం ఏంటని, దీనిలో రాజకీయ జోక్యం ఎందుకు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. నేడు కూడా ఇక్కడ నిరసన చేస్తామని, అధికారులు స్పందించకుంటే వచ్చేనెల 5నుంచి 8 వరకు భద్రాకాళి దేవస్థానం ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. తమ హక్కులు సాధించుకునే వరకూ ఆందోళనలు చేస్తామన్నారు. కాగా, అమ్మవార్ల దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో మేడారం జాతర ఈవో రాజేంద్రం వైపున ఉన్న గేట్ ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు.



గద్దెల ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న పూజారులు

**ధర్నాను విరమింపజేసిన మంత్రి సీతక్క**

పూజారుల ధర్నా శిబిరాన్ని మంత్రి సీతక్క సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకొని న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మంత్రి సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

# తూము షటర్లు ఎత్తకుండా నిఘా ఏర్పాటు చేస్తాం





తూమును పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ డీఈ, అధికారులు

- నీటి పారుదల శాఖ డీఈ రవీందర్‌రెడ్డి

ములుగు, మే 29 (నమస్తే తెలంగాణ) : మత్స్యకారులు చెరువుల తూము షటర్లు ఎత్తకుండా నీటి పారుదల శాఖ నుంచి నిఘా ఏర్పాటు చేస్తామని ఆ శాఖ ములుగు డీఈ రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న 'నమస్తే'లో 'చేపల కోసం చెరువు ఖాళీ' కథనానికి నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు. బుధవారం డీఈ, ఏఈ లోకం చెరువు వద్దకు వచ్చి తూము, షటర్లు, చెరువును పరిశీలించారు. లోకం చెరువు ములుగు ఇరిగేషన్ డివిజన్ నంబర్-4 నిర్వహణలో ఉందని, చెరువు కింద 1,347ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడి ఉందని డీఈ తెలిపారు. యాసంగి పంటకు నీటి లభ్యతను బట్టి 150 ఎకరాలకు నీటిని విడుదల చేశామన్నారు. సీజన్ పూర్తయినందున తూము ద్వారా నీరు వెళ్లకుండా నిలిపివేశామని తెలిపారు. తూము షటర్ తుప్పు పట్టి రంధ్రం ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పైఅధికారులకు పంపించినట్లు తెలిపారు. చేపలు పోసిన కాంట్రాక్టర్ ఒక వేళ రాత్రి వేళలో దొంగతనంగా తూము షటర్ ఎత్తితే క్రిమినల్ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

# అందరి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధి

- కేయూ భూముల ఆక్రమణదారులపై చర్యలు
- ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ
- విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశాలు
- కేయూలో నెలకొన్న సమస్యలపై ఆగ్రహం

హనుమకొండ చౌరస్తా, మే 29 : కేయూ ఒక దేవాలయం.. అందరి సహకారంతో వర్సిటీని అభివృద్ధి చేస్తానని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ అన్నారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డితో కలిసి సెనేట్‌హాల్‌లో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలను పరిష్కరించుకుందామని, నిర్మాణాత్మక ఎజెండాతో ముందుకు పోవాలన్నారు. జిల్లా అధికారుల సహాయంతో కాంపౌండ్ వాల్, పారిశుధ్య పనులు పూర్తి చేద్దామన్నారు. భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. బోధనేతర ఉద్యోగ సంఘాల నాయకులు పలు సమస్యలపై ఇన్‌చార్జి వీసీకి వినతిపత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శి వల్లాల తిరుపతి, తోట ప్రభాకర్, అబ్దుల్ షూకూర్, కొర్నేల్, వేణు, రామనాథం, మల్లికాంబ పాల్గొన్నారు. అలాగే కేయూలో అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో వీసీ దృష్టికి తీసుకువచ్చారు. మాజీ వీసీ టీచర్లకు మూడో, నాలుగవ పదోన్నతుల ఏరియర్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని, పదోన్నతుల అప్లికేషన్ల స్క్రూటినీ పూర్తి చేసి ప్రమోషన్ ఇవ్వాలన్నారు. సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ టీచర్లకు హెడ్‌షిప్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని విభాగాల్లో బీవోఎస్ చైర్మన్లను కూడా అక్రమంగా నియమించారని, సోషియాలజీలో వెంటనే హెడ్, బీవోఎస్ చైర్మన్లుగా అర్హత ఉన్న సీనియర్ టీచర్లకు ఇవ్వాలని కోరారు. అకుట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బ్రహ్మేశ్వరి, జాయింట్ సెక్రటరీ కిశోర్‌కుమార్, ఈసీ సభ్యుడు రమేశ్ ఉన్నారు. అలాగే వర్సిటీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేయూ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ సమస్యలపై వాకాటి కరుణకు వినతి పత్రం అందజేశారు. గత వీసీ రమేశ్ యూనివర్సిటీని భ్రష్టు పట్టించారని, మెస్‌కార్డు డిపాజిట్ పేరుతో రూ.2 వేల నుంచి డిపాజిట్లను రూ.12 వేలకు పెంచి విద్యార్థులపై మోయలేని భారం వేశాడని వెంటనే వీటిని తగ్గించాలన్నారు. యూనివర్సిటీ భూములు కబ్జా అవుతుంటే పట్టించుకోలేదని, కనీసం ల్యాబ్స్ కూడా లేనిస్థితి యూనివర్సిటీలో ఉందన్నారు. ప్రొఫెసర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు వినతి పత్రం అందజేస్తున్న అకుట్ సభ్యులు